క్లుప్తంగా

తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలి

హన్మకొండ : తడి, పొడి చెత్త వేర్వేరుగా చేసి ఇంటి వద్దకు వచ్చే వాహనాలకు అందించాలని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత సూచించారు. శనివారం హనుమకొండ సుబేదారి అలీపురలో ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గుజ్జుల మహేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జవాన్ సతీశ్ కుమార్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఓబీసీ సెల్ జనరల్ సెక్రటరీగా రాజుయాదవ్



శ్రీకాంత్‌ను కలిసిన తొట్ల రాజుయాదవ్

హన్మకొండ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ సెల్ జనరల్ సెక్రట రీగా కాజీపేట మండలం మడికొండకు చెందిన తొట్ల రాజుయాదవ్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్ ప్రకటించా రు. శనివారం హైదరాబాద్‌లో రాజుయాదవ్ శ్రీకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి అతని నుంచి నియామకపత్రం అందుకున్నారు. రాజుయాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు, రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ రాఘవరెడ్డికి, కృతజ్ఞతలు తెలిపారు.

దళిత పోలీసు అధికారులకు నివాళి

హన్మకొండ : కులా దురహంకారానికి విధి నిర్వహణలో ఒత్తిడికి గురై అసువులు బా సిన దళిత పోలీసు అధికారులు పూరన్ కుమార్ ఐపీఎస్, ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తిలకు శనివారం మడికొండ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా విజయ్



నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల ఇన్‌చార్జ్ రాజేశ్వర్‌రావు

నయీంనగర్ : ఆర్యవైశ్య సంఘం హనుమకొండ మండల అధ్యక్షుడిగా అంచూరి విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నగరంలో ఈ ఎన్నికలు నిర్వహించగా అధ్యక్ష పదవికి విజయ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన ఏకగ్రీవమైనట్లు ఎన్నికల ఇన్‌చార్జ్ చకిలం రాజేశ్వర్‌రావు ప్రకటించారు. అనంతరం నియామక పత్రాన్ని అందించారు. ఎన్నికల పర్యవేక్షకులు ఐత వెంకటేశ్వర్లు, మునీందర్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట



ఖుస్రూ పాషాను సన్మానిస్తున్న జమా మజీదు కమిటీ సభ్యులు

కాజీపేట : రాష్ట్రంలో ఉన్న మైనార్టీ ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా బియాబాని అన్నారు. మండల కేంద్రంలో శనివారం జమా మజీదు అభివృద్ధి కమిటీ సభ్యులు ఖుస్రూ పాషాను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ముస్లింల ఖబ్రస్తాన్ కోసం 3 ఎకరాల స్థలం ఇప్పించడానికి తోడ్పాటును అందించడంపై కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ రజాలీ, కమిటీ అధ్యక్షుడు ఖాజా సహిద్, షేక్ అస్గర్, షేక్ మహమూద్, బిలాల్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్



వరంగల్ అర్బన్ : తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జన్ను ప్రకాశ్ ఎన్నికైనట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సింగారపు బాబు, అధ్యక్షుడిగా సింగారపు కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఓరుగంటి జీవన్‌కుమార్, కోశాధికారిగా పత్తిపాక వినయ్, ఉపాధ్యక్షులుగా సాంబయ్య, బొజ్జ రాజు, అశోక్, సహాయ కార్యదర్శిగా జక్కుడి రామకృష్ణను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

పెచ్చులూడుతున్న జీపీ భవనం



పగుళ్లతో శిథిలమైన పంథిని జీపీ భవనం



అసంపూర్తిగా నిలిచిన జీపీ భవన నిర్మాణ పనులు

- నిలిచిన నూతన భవన నిర్మాణ పనులు
- భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ సిబ్బంది
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఐనవోలు : స్థానిక ప్రజలకు ప్రభుత్వ సేవలు, ప్రాథమిక సౌకర్యాలు అందించే కేంద్రంగా ఉండే పంథిని గ్రామ పంచాయతీ కార్యాలయం పగుళ్లతో శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు, గోడలు పెచ్చులూడిపోతూ దర్శనమిస్తోంది. వర్షాకాలంలో గదిలోకి నీరు చేరుతుండటంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్థానికులు పలుమార్లు నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామ పంచాయతీ భవనానికి రూ.20.06 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయించి అక్టోబర్ 5–2023న నూతన భవనానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ భూమి లెవల్ కంటే 3 ఫీట్ల



పెచ్చులూడుతున్న జీపీ భవనం పైకప్పు

ఎత్తువరకు పిల్లర్లు పోశారు. శంఖుస్థాపన అనంతరం 2 నెలలకు బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులు, ప్రస్తుత ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చినా పనులు ప్రారంభించడం లేదనే విమర్శలు

నూతన భవనాన్ని నిర్మించాలి



శిథిలావస్థకు చేరుకున్న భవనంలో విధులు నిర్వర్తిస్తూ అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం మంజూరైన భవనం పిల్లర్ల దశలో అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టిసారించి వెంటనే నూతన జీపీ భవనాన్ని నిర్మించాలి.

\- బూస సురేశ్, పంథిని

వస్తున్నాయి. జీపీ అధికారులు, సిబ్బంది పనిచేస్తున్న సమయంలో పైకప్పు ఊడి మీద పడితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు నిలదీస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ పనులను తిరిగి ప్రారంభింపజేయడమో లేదంటే రీఎస్టిమేషన్స్‌తో నూతన జీపీ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డిప్యూటీ కలెక్టర్

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన మహ్మద్ అహ్మద్ ఇటీవల మెదక్ జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అహ్మద్‌ను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉరుగొండ గ్రామానికి చెందిన చోటే–చాంద్‌బీల కుమారుడు అహ్మద్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమకం అవడం అభినందనీయమని అన్నారు. రా నున్న రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు.



ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ అహ్మద్

ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రవి, రాజేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీటీడీ ఆధ్యాత్మిక కార్యక్రమాలు



భజనలో పాల్గొన్న భక్తులు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. హనుమకొండలోని ఆనంద ఆశ్రమంలో జరిగిన ప్రతీ రోజు జరిగిన కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, భజనలు జరిగాయి. ప్రోగ్రాం ఇన్‌చార్జ్ రామిరెడ్డి కృష్ణమూర్తి, ఆశ్రమ నిర్వాహకులు సీహెచ్.లక్ష్మీనారాయణ, పద్మావతి, నాగమణి, రాధిక, భాస్కరాచార్య, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సహకరించిన వారికి ధన్యవాదాలు



మాట్లాడుతున్న దూపం సంపత్

వరంగల్ : కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 1986 నుంచి గత ఏడాది వ రకు జరిగిన ఉత్సవాలకు సహకరించిన దాతలు, ప్రజలకు ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్, కన్వీనర్ బయ్యి స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్ ధన్యవాదాలు తెలిపారు. శనివారం కాశిబుగ్గలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో 2009 నుంచి 2025 మార్చి వరకు ఉత్సవ సమితి లెక్కలను ప్రకటించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ 16 ఏళ్లలో ఉత్సవాల సందర్భంగా దాతల వద్ద నుంచి సేకరించిన డబ్బుల్లో ప్రస్తుతం ఉత్సవ సమితి వద్ద రూ.29,114 ఉన్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఉత్సవ సమితి నాయకులు ఓని భాస్కర్, బాంబుల కుమార్, గోరంట్ల మనోహర్, గుత్తికొండ నవీన్, సిద్దోజు శ్రీను, వేముల నాగరాజు, గణపాక సుధాకర్, చిందం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంతా గోల్‌మాల్...

దసరా ఉత్సవ సమితి నిర్వాహకులు చూపెట్టిన లెక్కలు లోపభూయిష్టంగా ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్సవ సమితి వసూలు చేసిన డబ్బులు అదే పేరుతో నిర్వహిస్తున్న పరపతి సంఘంలోని కొంత డబ్బులు తీసుకున్నప్పటికీ ఆ లెక్కలను సమావేశంలో ప్రకటించలేదని సభ్యులు ఆరోపిస్తున్నారు. సంఘం డబ్బులు రూ.6 లక్షలకు పైగా వాడుకున్న కోశాధికారి వద్ద నుంచి వసూలు చేస్తామని అగ్రిమెంటు చేసుకున్న బాధ్యులు మార్చిలోగా సభ్యులకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ లెక్కలు మొత్తం గోల్‌మాల్‌గా ఉన్నాయని మెజార్టీ ఉత్సవ సమితి సభ్యులు, సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి



రమేశ్

ఎల్కతుర్తి : కూతురి వివాహానికి చేసిన అప్పు తీర్చే స్థోమత లేకపోవడం, మరో వైపు అనారోగ్యం వెంటా డుతుండడంతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఈనెల 6న పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ సంఘటన ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండి రమేశ్(47) తన కూతురి వివాహానికి రూ.5లక్షలు అప్పు చేశాడు. కాగా కొంత కాలంగా రమేశ్ షుగర్ వ్యాధితో బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యాడు. కూతురి వివాహానికి చేసిన అప్పు తీర్చలేక మనస్థాపం చెంది ఈనెల 6న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి రమేశ్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు తెలిపారు.

ఆత్మకూరులో వివాహిత..

ఆత్మకూరు : గడ్డిమందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని అక్కంపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. అక్కంపేట గ్రామానికి చెందిన యాదం లక్ష్మి(33) తన భర్త మద్యానికి బానిసయ్యాడు. పనికి వెళ్లకుండా ఇంటివద్దే ఉంటూ అవమానించడంతో మనోవేధనకు గురైన ఆమె.. ఈనెల 9న గడ్డిమందు తాగింది. స్థానికులు, భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి సోదరుడు బండి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

రేగూరికి మాతృవియోగం



పరకాల : మున్సిపల్ మాజీ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి తల్లి రేగూరి రంగమ్మ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సోదా అనిత, మాజీ కౌన్సిలర్స్, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రంగమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న లారీ, జేసీబీ పట్టివేత

ధర్మసాగర్ : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. సీఐ శ్రీధర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై దిలీప్, పోలీస్ సిబ్బంది శనివారం రాయగూడెం సమీపంలోని సరస్వతిమాతా టెంపుల్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదే సమయంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీ, జేసీబీని పట్టుకుని డ్రైవర్లను విచారించినట్లు తెలిపారు. లారీ తీగలతండాకు చెందిన భూక్యా యాదగిరిదని తెలిసిందని, వెంటనే లారీ, జేసీబీని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. జేసీబీ యజమాని మలోత్ ఠాగూర్, లారీ డ్రైవర్, జేసీబీ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

‘వేధింపులతోనే పూరన్‌కుమార్ ఆత్మహత్య’

పరకాల : హరియాణా రాష్ట్రంలోని ఉన్నతాధికారుల వేధింపులు భరించలేక సీనియర్ ఐపీఎస్ అధికారి వై.పూరన్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నారని, హరియాణా ప్రభుత్వమే బాధ్యత వహించాలని వాల్మీకి యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోదా రామకృష్ణ డిమాండ్ చేశారు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించాలని అక్కడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఉన్నతాధికారులతో మానసిక ఒత్తిళ్లు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఆత్మహత్యలు జరుగకూడదని, శాంతిభద్రతలను కాపాడే అధికారులే ఆత్మహత్యలకు పాల్పడడం విచారకరమన్నారు. తక్షణమే ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్త ఆందోళనలు చేపడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

‘సమాచార హక్కు చట్టానికి జీవం పోయండి’

హన్మకొండ చౌరస్తా : గత ప్రభుత్వ నిర్వాకం ఫలితంగా రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలు నీరుగారిపోయిందని పలువురు సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం హనుమకొండలోని కల్యాణి ఆస్పత్రిలో చర్చా గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర నాయకుడు పర్చా కోదండరామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో ఏర్పడిన నూతన ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా జవాబుదారితనంతో సేవలు అందేలా సమాచార కమిషనర్లు కృషి చేయాలని కోరారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



పరకాల : చాలా కాలంగా కరెంట్ స్తంభం లేకపోవడంతో విద్యుత్ అవసరాల కోసం 9వ వార్డులోని సాయినగర్ కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను కాలనీవాసులు మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన.. సాయినగర్‌లో కరెంట్ స్తంభం ఏర్పాటుకు అడ్డుపడుతున్న పలువురితో మాట్లాడి స్తంభం ఏర్పాటుకు ఒప్పించారు. దీంతో విద్యుత్ అధికారులు శనివారం స్తంభాన్ని ఏర్పాటు చేయగా కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. మాజీ కౌన్సిలర్ పూర్ణాచారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా పోరాటాలు సీపీఎంతోనే సాధ్యం

ఐనవోలు : పేద ప్రజల కోసం ప్రజా పోరాటాలు చేయడం సీపీఎంతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి అన్నారు. శనివారం మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో పది కుటుంబాలు సీపీఎంలో చేరగా బొట్ల చక్రపాణి, కాడబోయిన లింగయ్య వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులాల, మతాల నడుమ చిచ్చు పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీలో చేరిన



కండువాలు కప్పుతున్న సీపీఎం నాయకులు

వారిలో సింగారపు నాగరాజు, సుధాకర్, రాజుందర్, సలీం, రాజు, ఐలయ్య ఉన్నారు. మండల నాయకులు నారాయణరెడ్డి, ఉప్పలయ్య, యాకూబ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాదారులు నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు : మండలంలోని వివిధ దుకాణాలు రాత్రి 10.30 గంటల వరకు మూసివేయాలని సీఐ సంతోశ్ సూచించారు. గూడెప్పాడ్ జంక్షన్‌లో శనివారం వివిధ షాపుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాత్రి 10.30 గంటల వరకు షాపులు మూసివేయాలని, సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి ఆలస్యంగా మూసివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న సీఐ సంతోశ్

ఓవైపు సుందరీకరణ.. మరోవైపు చెత్తాచెదారం



దామెర చెరువు ట్యాంక్‌బండ్ కట్టపై పేరుకుపోయిన చెత్తాచెదారం

- డంపింగ్‌యార్డును తలపిస్తున్న దామెరచెరువు ట్యాంక్‌బండ్
- చర్యలు తీసుకోని అధికారులు

పరకాల : రూ.కోట్లు వెచ్చించి ట్యాంక్‌బండ్ పేరిట ఒకవైపు సుందరీకరణ పనులు చేపటుతుంటే మరోవైపు పరకాల దామెర చెరువు కట్ట డంపింగ్ యార్డును తలపిస్తుంది. పట్టణంలోని దామెర చెరువును సుందరీకనించాలనే ఆలోచనతో గత ప్రభుత్వం సుమారు రూ.5కోట్ల నిధులు కేటాయించింది. అయా నిధులతో ఇప్పటికే 60 శాతం పనులు పూర్తికాగా మిగతా పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయితే ట్యాంక్‌బండ్ పరిస్థితి ఇలా ఉండగా.. చెరువు కట్ట ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్న తరుణంలో కొందరు చెరువు కట్టపై చెత్తాచెదారం, చనిపోయిన పశువుల, కుక్కల, పందుల



ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి(ఫైల్)

కళేబరాలు వేసి వెళ్లిపోతున్నారు. దీంతో కట్ట ప్రాంగణంలో ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న పట్టణ ప్రజలు దుర్వాసనతో ముక్కు మూసుకుంటున్నారు. ఒక్కో సమయంలో కుక్కలు దాడి చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెరువు కట్టపై చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డివైడర్ మధ్యలో పైపులైన్ లీకేజీ

శాయంపేట : మండల కేంద్రంలోని దేవుని చెరువు బావి వద్ద నుంచి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనఉన్న కాలనీకి నీటి సరఫరా చేసే పైపులైన్ మెయిన్ రోడ్డు డివైడర్ మధ్య లీకేజీ అయ్యింది. దీంతో నీరు ఉబికి వస్తుండడంతో నీరు కలుషితమవుతన్నాయని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. రోడ్డుపై నీరు ప్రవహిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



డివైడర్ మధ్యలో పైపులైన్ లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దామెర : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మండలంలోని పసరగొండలో శనిగరపు లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం గ్రామంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని సూచించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ మాజీ ఉపాధ్యక్షుడు మంద రమేశ్ బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. పొడాల మధుకర్, సూర చందర్, చెక్క సతీశ్, మంద మనోజ్, రమేశ్, సంజీవ, రంగారావు, శ్రీనివాస్, శ్రీశైలం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ

మామునూరు : క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, క్రీడలతో స్నేహ భావంతో పాటు క్రమశిక్షణ, పోటీతత్వం పెంపొందుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామ చంద్రం, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వై.వెంకటయ్య, వాగ్దేవి కళాశాల డైరెక్టర్లు వాణీదేవి, సీహెచ్.సుదర్శన్‌రెడ్డి, ఇంతేజార్‌గంజ్, మామునూరు సీఐలు సుక్రు, రమేష్ అన్నారు. శనివారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి క్రీడామైదానంలో కేయూ ఆధ్వర్యంలో వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సునీల్‌రెడ్డి సహకారంతో 11 నుంచి 13 వరకు జరగనున్న యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ ఫర్ ఉమెన్స్ 2025–26 టోర్నమెంట్స్ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా వారు హాజరై క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కేయూ పరిధిలోని వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, చెస్, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నీస్, బాల్ బ్యాడ్మింటన్, క్రాస్ కంట్రీ తదితర క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీపతి, వివిధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు, 1500 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు.